క్లుప్తంగా

ఘనంగా రాములవారి గ్రామోత్సవం



జమీదగ్గుమిల్లి(పామర్రు): గ్రామంలోని సీతా రామాంజనేయస్వామి ఆలయంలో విజయదశమి సందర్భంగా శనివారం ఉదయం పూజలను చేశారు. రాత్రికి స్వామిని హనుమంత వాహనంపై కొలువుదీర్చి గ్రామోత్సవం నిర్వహించారు. తొలుత స్థానిక పశువైద్యశాల ఆవరణలో ఉన్న శమీ వృక్షానికి విజయదశమి సందర్భంగా భక్తులు కూనపరెడ్డి హరనాథ్‌బాబు, వెంకట బాలాజీ దంపతులు పూజలను నిర్వహించారు. గ్రామ సర్పంచ్ చంద్రశేఖర్‌రావు, ఆలయ కమిటీ సభ్యుడు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌గా శ్రీనివాసరావు



గుడివాడ టౌన్: గుడివాడ మున్సిపల్ కమిషనర్‌గా బి.శ్రీనివాసరావు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. డీఎంఏ కార్యాలయంలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న శ్రీనివాసరావు బదిలీపై గుడివాడకు వచ్చారు. గుడివాడ మున్సిపల్ కమిషనర్ జి. బాలసుబ్రహ్మణ్యం ఆర్డీఓగా ఉద్యోగోన్నతి పొందిన నేపథ్యంలో ఏర్పడిన ఖాళీలో శ్రీనివాసరావు నియమితులయ్యారు. అసిస్టెంట్ కమిషనర్ పి.శ్రీనివాసరావు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది ఆయనకు తొలుత స్వాగతం పలికారు.

బాబా పల్లకీ ఉత్సవం

మండవల్లి: స్థానిక షిర్డీ సాయిబాబా మందిరంలో శనివారం రాత్రి పల్లకీ ఉత్సవం పురవీధుల్లో నిర్వహించారు. ఉదయం స్వామికి 108 కలశాలతో అభిషేకాలు, మధ్యాహ్నం సమాధి ఉత్సవం, రాత్రికి పల్లకీ ఉత్సవం జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సుబ్బారాయుడిని దర్శించుకున్న భక్తులు

ముదినేపల్లి రూరల్: సింగరాయపాలెం–చేవూరుపాలెం సెంటర్లోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. జిల్లాలోని నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు ఉదయానికే ఆలయానికి చేరుకున్నారు. స్వామివారి పుట్టలో పాలు పోయడం మొదలు పాలపొంగళ్లశాల వద్ద నైవేద్యాలు తయారుచేసేందుకు సైతం భక్తులు పోటీపడ్డారు. నాగబంధాల వద్ద, గోశాల వద్ద మహిళలు భారీ ఎత్తున పూజలు చేశారు. సహాయ కమిషనర్ గంగాశ్రీదేవి ఏర్పాట్లు పర్యవేక్షించారు.

నేడు సర్వసభ్య సమావేశం

మండవల్లి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం మధ్యాహ్నం రెండు గంటలకు ఎంపీపీ పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్(రాము) అధ్యక్షతన మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రామలింగేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

నేడు హుండీ కానుకల లెక్కింపు

గుడివాడ టౌన్: స్థానిక మెయిన్ రోడ్డులోని విఘ్నేశ్వర స్వామి ఆలయ హుండీ కానుకల లెక్కింపును సోమవారం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ వై. శ్రీనివాస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్సవ కమిటీ సభ్యులు, దేవదాయ శాఖ అధికారుల సమక్షంలో ఉదయం 10 గంటలకు ఆలయ ప్రాంగణంలో లెక్కింపు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

సౌర విద్యుత్ పథకంపై నేడు అవగాహన

తోట్లవల్లూరు: ఇళ్లకు సౌర విద్యుత్ ప్యానెల్స్ ఏర్పాటుపై ఉయ్యూరు కేసీపీ ఆడిటోరియంలో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ట్రాన్స్‌కో ఈఈ డీ. కృష్ణానాయక్ తెలిపారు. సాయంత్రం నాలుగు గంటలకు జరిగే సదస్సుకు ఉయ్యూరు, తోట్లవల్లూరు మండలాల వినియోగదారులు హాజరు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సదస్సులో పీఎం సూర్యఘర్ పథకం వివరాలు, ప్రయోజనాలు వివరించనున్నట్లు పేర్కొన్నారు.

కోడిపందేలపై పోలీసుల దాడి

తోట్లవల్లూరు: కోడిపందేల శిబిరంపై పోలీసులు దాడి జరిపిన ఘటన మండలంలోని చాగంటిపాడులో జరిగింది. గ్రామానికి సమీపంలోని కృష్ణానది తీరాన నిర్వహిస్తున్న కోడిపందేలపై ఎస్‌ఐ ఎం.అర్జునరాజు దాడి చేశారు. ఈ దాడిలో నలుగురు పందెంరాయుళ్లను అదుపులోకి తీసుకోవటంతోపాటు రెండు కోడిపుంజులు, రూ.3,600ను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

కిక్కిస రక్కసి..!

- డ్రెయిన్లలో పేరుకుపోతున్న కిక్కిస
- వర్షాకాలంలో పొంగుతున్న డ్రెయిన్లు



పెదకొమ్మిలేరు డ్రెయిన్ పొడవునా దట్టంగా పేరుకుపోయిన కిక్కిస

ముదినేపల్లి రూరల్: మండలంలోని పలు మీడియం, మైనర్ డ్రెయిన్లలో కిక్కిస దట్టంగా పేరుకుపోయి మురుగునీటి ప్రవాహానికి అడ్డంకిగా మారింది. దీంతో వర్షాకాలంలో మురుగునీరు సక్రమంగా ప్రవహించకపోవడంతో పొలాలు ముంపుబారిన పడుతున్నాయి. ఏళ్ల తరబడి డ్రెయిన్లు మరమ్మతులకు నోచుకోక పూడుకుపోవడంతో ఈ పరిస్థితి తలెత్తుతోంది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పలు డ్రెయిన్ల పరిధిలోని వేలాది ఎకరాలు వరి పంటలు నీటమునిగి రైతులకు తీరని నష్టాన్ని మిగిల్చాయి. మండలంలో 15వేల ఎకరాల్లో వరి సాగు జరుగుతోంది. ఈ పొలాల్లోని మురుగు, వరదనీరు మీడియం, మైనర్ డ్రెయిన్ల నుంచి మేజర్ డ్రెయిన్లలోకి తరలించాలి. ప్రధానమైన పోల్‌రాజ్, పెదలంక మేజర్ డ్రెయిన్లలో కిక్కిస సమస్య లేనప్పటికీ ఊటుకూరు, ఈడేపల్లి, పెదకొమ్మిలేరు, పెదగొన్నూరు, అన్నవరం మీడియం డ్రెయిన్లు కిక్కిసతో నిండిపోయి నీరు ప్రవహించటం లేదు. ఈ డ్రెయిన్ల పరిధిలో ఇటీవల కురిసిన వర్షాలకు వేలాది ఎకరాల్లో పంట నష్టం జరిగిందంటే పరిస్థితి తీవ్రత తెలుస్తోంది. మైనర్ డ్రెయిన్ల పరిస్థితి ఇందుకు భిన్నంగా ఏమీలేదు.

ఆక్రమణలతో కుచించుకుపోతున్న డ్రెయిన్లు

మండలంలోని పలు డ్రెయిన్లు ఆక్రమణలకు గురవుతూ కుచించుకుపోతున్నాయి. ప్రధాన సెంటర్ల వెంబడి ప్రవహించే ఈ డ్రెయిన్లు ఆక్రమణలకు గురై నిర్మాణాలు జరగడంతో నీరు ప్రవహించేందుకు ఆటంకాలు ఏర్పడుతున్నాయి. అన్నవరం మీడియం డ్రెయిన్ శ్రీహరిపురం సింగరాయపాలెం సెంటర్లలో ఆక్రమణలకు గురై కుచించుకుపోయింది. అదేవిధంగా ముదినేపల్లి నుంచి పెయ్యేరు, వడాలి వరకు మురుగును ధాకేరు కాలువలో కలిపే డ్రెయిన్ రూపురేఖలు కోల్పోయింది. ప్రధాన రహదారి వెంబడి ఉన్న ఈ డ్రెయిన్‌ను ఎక్కడికక్కడ ఆక్రమించుకుని నిర్మాణాలు చేపట్టారు.

నిధులు లేవు

డ్రెయిన్లలో పేరుకుపోయిన కిక్కిసను తొలగించేందుకు ప్రభుత్వం ఎలాంటి నిధులు మంజూరు చేయడంలేదు. దీంతో పరిస్థితి తీవ్రత రోజురోజుకు పెరుగుతుందే తప్ప ఏమాత్రం తగ్గటం లేదు. పలు గ్రామాల్లో రైతులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి కిక్కిసను తొలగించారు. నీటి సంఘాలను పునరుద్ధరిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఈ నేపథ్యంలో వీటికి ఎన్నికలు జరిగే వరకు నిధులు విడుదలయ్యే అవకాశం లేదని పలువురు పేర్కొంటున్నారు.



ఈడేపల్లి డ్రెయిన్‌లో నీటి ప్రవాహానికి ఆటంకంగా మారిన కిక్కిస

చర్యలు తీసుకోవాలి



డ్రెయిన్లలో కిక్కిస పేరుకుపోతున్నందున పొలాలు నీట మునిగి తీవ్రంగా నష్టపోతున్నాం. దీనిని తొలగించేందుకు సంబంధిత అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలి. కిక్కిస తొలగించకపోవడంతో గత నెల్లో కురిసిన వర్షాలకు పొలాలు మునిగి తీవ్రంగా నష్టపోయాం.

– శొంఠి నాగరాజు, చేవూరుపాలెం

నిధులు విడుదల చేయాలి



కిక్కిస తొలగించమని కోరితే నిధులు లేవని అధికారులు సమాధానం చెబుతున్నారు. ఎంతకాలం ఈ విధంగా కిక్కిసను తొలగించకుండా కాలయాపన చేస్తారు? పరిస్థితి తీవ్రత గమనించి ప్రభుత్వం వెంటనే నిధులు విడుదల చేసి రైతుల కష్టాలు గట్టెక్కించాలి.

– అచ్యుత పాములు, నరసన్నపాలెం

కొండలమ్మను దర్శించుకున్న జడ్జి



అమ్మవారిని దర్శించుకున్న జడ్జి రాజశేఖర్ దంపతులు



ఏఎస్పీ ప్రసాద్, డీఎస్పీ సుభానీకి అమ్మవారి చిత్రపటాలను అందజేస్తున్న ఈఓ

గుడ్లవల్లేరు: వేమవరం శ్రీ కొండలమ్మ అమ్మవారిని దసరా నవరాత్రుల సందర్భంగా తెనాలి జడ్జి పి.రాజశేఖర్ దంపతులు ఆదివారం దర్శించుకున్నారు. ఏఎస్పీ ఎస్.వి.డి.ప్రసాద్, డీఎస్పీ అబ్దుల్ సుభాని శనివారం దర్శించుకున్నారు. వారిని ఆలయ ఈఓ కొండలరావు సన్మానించి అమ్మవారి చిత్రపటాలు, లడ్డూ ప్రసాదాన్ని అందించారు. ఎస్‌ఐ సత్యనారాయణ పాల్గొన్నారు.

కనకదుర్గ ఆలయంలో అన్నసమారాధన

కైకలూరు: వ్యవసాయ మార్కెట్ యార్డు సమీప కనకదుర్గ ఆలయంలో దసరా మహోత్సవాలు ఘనంగా జరిగాయి. ఉత్సవాల ముగింపు సందర్భంగా ఆదివారం భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో చంద్రశేఖర్, రాధా, దుర్గాప్రసాద్, కలిదిండి నాగసాయి, జగదీష్, కిరణ్, శివ బాబు, వెంకటఅప్పారావు పాల్గొన్నారు.

గుడ్లవల్లేరులో..

గుడ్లవల్లేరు: డోకిపర్రు భూ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో దూరప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు భారీ అన్నసమారాధనను నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మెయిల్ ప్రతినిధి పురిటిపాటి వీరారెడ్డి, విజయలక్ష్మి దంపతులు ప్రారంభించారు. మెయిల్ మేనేజింగ్ డైరెక్టర్ పురిటిపాటి వెంకట కృష్ణారెడ్డి, సుధారెడ్డి ఆధ్వర్యంలో జరిగిందని నిర్వాహకులు తెలిపారు.



కైకలూరులో అన్నసమారాధన

ఉచితంగా మధుమేహ వైద్య పరీక్షలు

గుడ్లవల్లేరు: లయన్స్ క్లబ్ ఆఫ్ గుడ్లవల్లేరు వారి ఆధ్వర్యంలో స్థానిక లయన్స్ సేవాభవన్‌లో ఆదివారం ఉచిత మధుమేహ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. రోగులకు గుడివాడకు చెందిన వైద్యురాలు గవిర్నేని రజనీ వైద్య పరీక్షలు చేశారు. కొసరాజు బాపయ్యచౌదరి, వల్లభనేని రామకృష్ణ ఆర్థిక సాయంతో నిర్వహించిన ఈ శిబిరంలో 100 మందికి పరీక్షలు జరిగాయని లయన్స్ చైర్మన్ నిమ్మగడ్డ శశికళ తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ జిల్లా మాజీ చైర్మన్ వై.పి.సి.ప్రసాద్, కార్యదర్శి ఎం.పెరుమాళ్లు, కోశాధికారి కల్యాణపు నవాబు, లయన్స్ ప్రతినిధులు జంగం మోహనరావు, మూల్పూరి సుధ, సూరపనేని పరంధామయ్య తదితరులు పాల్గొన్నారు.



ఆరోగ్య సమస్యలు తెలుసుకుంటున్న డాక్టర్ రజనీ

ముగిసిన దసరా మహోత్సవాలు



దేవపూడి విజయదుర్గాంబ ఆలయంలో రాజరాజేశ్వరీదేవిగా అమ్మవారు



తోట్లవల్లూరు మండలం దేవరపల్లిలో హంస వాహనంపై అమ్మవారి గ్రామోత్సవం



కైకలూరు కన్యకాపరమేశ్వరీ ఆలయంలో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డీఎన్నార్ దంపతులకు సన్మానం



మండవల్లి మల్లేశ్వరస్వామి గ్రామోత్సవం



గుడ్లవల్లేరులో అమ్మవారి కలశాన్ని ఊరేగిస్తున్న సుబ్బారావు తదితర భక్తులు



శమీ పూజలో కొండలమ్మ ఆలయ ఈఓ కొండలరావు



తటివర్రురోడ్డులో పూజలు చేస్తున్న భక్తులు

కైకలూరు: దసరా మహోత్సవాలు వైభవోపేతంగా ముగిశాయి. చివరి రోజు ఆదివారం కైకలూరు శ్యామలాంబ, కన్యాకాపరమేశ్వరీ అమ్మవార్లు పుష్పశయన అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పలువురు ప్రజాప్రతినిధులు అమ్మవార్లను కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) శ్యామలాంబ, కన్యకాపరమేశ్వరీ, వేంకటేశ్వరస్వామి ఆలయం, రైతు బజారు సమీప విజయదుర్గాదేవీ అమ్మవార్లను కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ కలిదిండి మండలం కోరుకొల్లు యాదవపాలెంలో రామాలయానికి శంకుస్థాపన చేశారు. కైకలూరులో శ్యామలాంబ దేవస్థాన ఈఓ వీఎన్‌కే.శేఖర్ మాట్లాడుతూ ఈ నెల 17 వేద సభ, 21న గ్రామోత్సవం, 27న భారీ అన్నసమారాధన నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ముదినేపల్లిలో..

ముదినేపల్లి రూరల్: మండలంలోని దసరా ఉత్సవాలు శనివారంతో ముగిశాయి. పలు ఆలయాల్లో అమ్మవార్లు రాజరాజేశ్వరీదేవీగా భక్తులకు దర్శనమిచ్చారు. దేవపూడి విజయదుర్గాంబ పెయ్యేరు, బొమ్మినంపాడు, అల్లూరు కనకదుర్గ ఆలయాలు పెదకామనపూడి రామలింగేశ్వరస్వామి, గురజ శివాలయం, సింగరాయపాలెం అమృతేశ్వరస్వామి ఆలయాల్లో అమ్మవారు రాజరాజేశ్వరీదేవీగా పూజలు అందుకున్నారు. బొమ్మినంపాడులో ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ అమ్మవారికి పూజలు చేశారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా వణుదుర్రులో అన్నసమారాధన నిర్వహించారు. రెండోపూరీగా ప్రసిద్ధి చెందిన వడాలి శ్రీజగన్నాథస్వామి ఆలయంలో శనివారం రాత్రి శమీపూజ చేశారు. ఆలయ ఈఓ శింగనపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అర్చకులు అగ్నిహోత్రం శ్రీనివాసాచార్యులు శమీ వృక్షానికి పూజలు చేశారు.

మండవల్లిలో..

మండవల్లి: మండవల్లిలోని శ్రీ భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి ఆలయంలో కొలువై ఉన్న స్వామి, అమ్మవార్ల గ్రామోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఎండోమెంట్స్ కార్యనిర్వహణాధికారి కే దివ్యశ్రీ ఆధ్వర్యంలో గ్రామోత్సవం జరిగింది. దసరా ఉత్సవాల్లో భాగంగా శనివారం అమ్మవారిని శ్రీ రాజరాజేశ్వరీదేవిగా అలంకరించి పూజించారు. సోమవారం స్వామివారి సన్నిధిలో అఖండ అన్నసమారాధన నిర్వహిస్తున్నట్లు ఈఓ దివ్యశ్రీ పేర్కొన్నారు.

తోట్లవల్లూరులో..

తోట్లవల్లూరు: పది రోజులపాటు నిర్వహించిన దేవీ శరన్నవరాత్రులు వైభవంగా ముగిశాయి. తోట్లవల్లూరు శివాలయంలో ఉత్సవాల చివరి రోజైన శనివారం అమ్మవారు శ్రీరాజరాజేశ్వరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. వాసవీ ఆలయంలో కూడా అమ్మవారికి నవరాత్రులను పురస్కరించుకుని పూజలు నిర్వహించారు. రజకపేట, కనకదుర్గ కాలనీ వద్ద పూజా మండపాలలో ఏర్పాటు చేసిన దుర్గమ్మ తల్లి విగ్రహాల గ్రామోత్సవ కార్యక్రమాలు వైభవంగా జరిగాయి.

గుడ్లవల్లేరులో..

గుడ్లవల్లేరు: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని గుడ్లవల్లేరు శ్రీ కన్యకా పరమేశ్వరీదేవి పంచాయన క్షేత్రంలో నవరాత్రులకు అమ్మవారి వద్ద కలశాన్ని ఆదివారం ఊరేగించారు. ఈ ఊరేగింపుతో నవరాత్రులు ఘనంగా ముగిశాయి. కార్యక్రమంలో ఆర్యవైశ్య ప్రముఖులు కంతేటి సుబ్బారావు, ముప్పిడి హేమంత్, సుధ, అనిల్, బాలసుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ప్రత్యేక హోమాలు

గుడ్లవల్లేరు: వేమవరం శ్రీ కొండలమ్మ తల్లి అమ్మవారు శ్రీ రాజ రాజేశ్వరీదేవిగా విజయదశమికి భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ఈఓ ఆకుల కొండలరావు ఆధ్వర్యంలో ఆలయ పండితుల వేద మంత్రోచ్ఛరణ నడుమ జమ్మి చెట్టు వద్ద శమీ పూజలు, విశేషాభిషేకాలతో పాటు ప్రత్యేక హోమాలను చేపట్టారు. ఉత్సవ కమిటీ సభ్యులు పెన్నేరు రమేష్, మోహనరావు, దేవేంద్ర పాల్గొన్నారు.

చామంతులపై శయనించిన అపరచండీ

గుడ్లవల్లేరు: దసరా నవరాత్రి ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని కౌతవరం శ్రీ గౌతమేశ్వరాలయంలో అమ్మవారు పూబంతుల శయ్యపై పవళించిన పార్వతీ దేవిగా భక్తుల నుంచి పూజలందుకున్నారు. అమ్మవారిని అలంకార సామ్రాట్ అంబా గౌతమేశ్వరరావు అలంకరించి, భక్తుల మెప్పు పొందారు.

శ్రీ పుష్ప శయనాదేవిగా అమ్మవారు



గుడివాడ టౌన్: దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు శనివారం ఘనంగా ముగిశాయి. విజయదశమి ముగింపును పురస్కరించుకుని స్థానిక బంటుమిల్లి రోడ్‌లోని శ్రీ భీమేశ్వర స్వామి వారి దేవస్థానం(పెద్ద శివాలయం)లో అమ్మవారిని ఆదివారం శ్రీ పుష్ప శయనాదేవిగా అలంకరించి భక్తుల దర్శనానికి ఉంచారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

తటివర్రురోడ్డులో..

గుడివాడరూరల్: దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు శనివారంతో ముగిశాయి. తటివర్రురోడ్డులో ఏర్పాటు చేసిన ఉత్సవాల్లో అమ్మవారు శ్రీమహిషాసురమర్దనీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆదివారం అమ్మవారి నిమజ్జన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. చిన ఎరుకపాడులో వేంసియున్న శ్రీఅష్టలక్ష్మీ అమ్మవారి దేవస్థానంలో అమ్మవారు శ్రీరాజరాజేశ్వరిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

ధ్యానకేంద్రం ప్రారంభం



తోట్లవల్లూరు: ధ్యానంతో మానసిక ప్రశాంతతతో పాటు మంచి ఆరోగ్యం లభిస్తుందని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. మండలంలోని దేవరపల్లిలో నూతనంగా నిర్మించిన పిరమిడ్ ధ్యానకేంద్రాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ బ్రహ్మర్షి సుభాష్ పత్రీజీ చూపిన మార్గం అందరికీ ఆదర్శనీయమని తెలిపారు. పీఎస్ఎస్ఎం జిల్లా అధ్యక్షుడు రాజకుమారి, శివనాగకృష్ణ, చెన్నకేశవరావు, పిరమిడ్ సేవాదళ్ జిల్లా కన్వీనర్ మూడే శివశంకర్, ధ్యాన కేంద్రం నిర్వాహకులు శివలీల, అరుణకుమారి పాల్గొన్నారు.

హోమియో వైద్యంతో రుగ్మతలు దూరం



గుడ్లవల్లేరు: ప్రాచీన వైద్యం హోమియో పద్ధతిలో ఎన్నో దీర్ఘకాలిక రుగ్మతలను దూరం చేసి వైద్యులు నిరూపించారని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ వల్లభనేని బాబూరావు అన్నారు. గుడ్లవల్లేరులో అరుణ హోమియోపతి క్లినిక్‌ను ఆయన శనివారం ప్రారంభించారు. వైద్యులు ఈదా బేబీ అరుణా పద్మాంజలి, ఎస్.వెంకటచౌదరి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మోహనరావు, కొండలమ్మ ఆలయ మాజీ చైర్మన్ ఏడుకొండలు పాల్గొన్నారు.

ఘనంగా మందిర వార్షికోత్సవం

పామర్రు: స్థానిక సాయినగర్‌లోని శ్రీషిర్డిసాయి బాబా మందిర వార్షికోత్సవం, బాబా వారి పుణ్య తిథి కార్యక్రమాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. తొలుత స్వామికి కాగడా హారతి ఇచ్చి కార్యక్రమాలను ప్రారంభించారు. అనంతరం భక్తులతో సాయి సహస్ర నామాలతో ప్రత్యేకంగా పూజలను జరిపించారు. మధ్యాహ్నం భక్తులకు అన్న సమారాధన కార్యక్రమం చేశారు. ఆలయ వంశ పారంపర్య ధర్మకర్త తమ్మా వినోద్‌రెడ్డి పాల్గొన్నారు.

అమ్మవారికి రాజరాజేశ్వరీదేవి అలంకారం

పామర్రు: విజయ దశమిని పురస్కరించుకుని శనివారం పలు ఆలయాల్లోని అమ్మవార్లను రాజరాజేశ్వరీదేవిగా అలంకరించి పూజలు చేశారు. స్థానిక సోమేశ్వరస్వామి, కన్యకా పరమేశ్వరీ, అంకమ్మ తల్లి ఆలయాల్లోని అమ్మవార్లకు రాజరాజేశ్వరీ అలంకారం నిర్వహించారు. సామూహిక కుంకుమ పూజలను చేశారు. విజయవాడ రోడ్డులోని పర్వత వర్ధనీదేవిని, కొండిపర్రు లోని భ్రమరాంబ దేవిని రాజరాజేశ్వరిగా అలంకరించి పూజించారు.

శ్రీ జ్ఞానసాయి సన్నిధిలో..

గుడ్లవల్లేరు: అంగలూరు శ్రీ జ్ఞానసాయి మందిరంలో విజయదశమిని పురస్కరించుని ఉత్సవాలు అమ్మవారి ఊరేగింపుతో అంగరంగ వైభవంగా ముగిశాయి. శ్రీ దత్తసాయి గాయత్రి సహిత శ్రీ మహాలక్ష్మీ హోమ కార్యక్రమాన్ని మందిర ప్రధాన నిర్వాహకులు యలమంచి నాగమోహన్, లక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించారు. 27 రకాల ద్రవ్యాలతో అమ్మవారికి, జ్ఞానసాయికి విశేషాభిషేకాలు చేశారు. రాజరాజేశ్వరీ దేవికి కుంకుమార్చనను నిర్వహించారు. బాబావారి మహా సమాధి ఉత్సవాలు చేశారు. శమీ పూజలు చేశారు. బాబావారి గ్రామోత్సవాన్ని వెండి పల్లకీలో చేపట్టారు. నిర్వాహకులు దుగ్గిరాల ఆంజనేయప్రసాద్, నాగవల్లీ, తిపిర్నేని రాజా, పొట్లూరి రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.



పామర్రులో రాజరాజేశ్వరిగా పర్వవర్ధనీదేవి



అంగలూరులో జ్ఞానసాయిగా..



మండవల్లి సెంటర్లో ఊరేగింపు

మండవల్లిలో..

మండవల్లి: స్థానిక సెంటర్ సమీపంలోని సాయిబాబా మందిరంలో దసరా ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఉత్సవాలు ముగింపు సందర్భంగా ఆదివారం అమ్మవారి ప్రతిమను ఘనంగా ఊరేగించారు. కార్యక్రమంలో భవానీమాల ధారులు, భక్తులు పాల్గొన్నారు.